

ప్రకృతి సాగులో 'విజయ'నాదం

ప్రకృతి సాగులో కొమ్మూరు విజయ్‌కుమార్ కొత్త చరిత్ర లిఖించాడు. చిరు ధాన్యాల సాగులో సిరులు పండిస్తూ ఇతరులకు ఆదర్శనంగా నిలుస్తున్నాడు. -8లో



హత్య కేసులో జీవితఖైదు

కడపలోని 2014లో జరిగిన హత్యకేసులో నిందితులకు జీవితఖైదు, రూ.3వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.3/18.9

జిల్లాలో శుక్రవారం 18.9 - 30.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ


మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు ఆర్టీఓగా నియమితులైన పి మురళీధర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు ఆర్టీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రాంతీయ రవాణాశాఖ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని చెప్పారు.

గ్రాఫిక్ డిజైన్‌లో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు గ్రాఫిక్ డిజైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ మల్టీ స్కిల్లింగ్ ట్రైనింగ్ సెంటర్ రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాఫిక్ డిజైన్ కోర్సుకు సంబంధించి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం లింగారెడ్డి గూడలోని తమ శిక్షణా కేంద్రంలో శిక్షణతోపాటు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తోందన్నారు. 40 రోజులపాటు కొనసాగే ఈ శిక్షణలో 18-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా లేదా ఏదేని ఒకేషనల్ కోర్సు చేసి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9063486822 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

సాధారణ చార్జీలతో సంక్రాంతి సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బస్సులను సాధారణ ఛార్జీలతో నడపనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. జనవరి 10 నుంచి జిల్లాలోని ఆరు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. హైదరాబాదుకు 90 బస్సులు, బెంగుళూరు 80, విజయవాడ 30, చెన్నై 10 బస్సులు, తిరుపతి, నెల్లూరు, కర్నూలు, అనంతపురంకు 30 బస్సులు కలిపి మొత్తం 240 బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. వీటికి అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు.

డీఎస్పీ నాగరాజుకు పదోన్నతి



కడప అర్బన్/జమ్మలమడుగు రూరల్: జమ్మలమడుగు డీఎస్పీ ఎస్. నాగరాజుకు అదనపు ఎస్పీగా పదోన్నతి లభించింది. ఈమేరకు హోం శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను కర్నూలు జిల్లా అదనపు ఎ స్పీ (అడ్మిన్)గా నియమించా రు. ఈయన 1989 బ్యాచ్‌లో ఎస్ఐగా పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరారు. 2000లో సీఐగా పదోన్నతి పొంది జిల్లాలోని పలు విభాగాల్లో విధులు నిర్వహించారు.

తప్పుడు రాతలపై ఆగ్రహజ్వాల

ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో తప్పుడు రాతలపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో తమ అక్కసును వెళ్లగక్కుతున్నాయని, తమ పత్రికలో తప్పుడు రాతలు అచ్చువేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధుల్లా ఉన్న వలంటీర్ వ్యవస్థను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయన్నారు. ఇటివంటి కథనాలతో వలంటీర్ల మధ్య ఐక్యతను దెబ్బతీయలేవన్నారు. శుక్రవారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో నిరసన వ్యక్తం చేశారు.

- వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో వలంటీర్ల నిరసన
- ఈనాడు, ఆంధ్ర జ్యోతి పత్రికల దహనం


వైఎస్సార్ జిల్లా పులివెందులలో ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

పులివెందుల టౌన్/వాల్మీకిపురం: తప్పుడు రాతలు రాస్తే సహించేదిలేదంటూ వలంటీర్లు ఈనాడు, ఆంధ్రజ్యోతి దిన పత్రికల యాజమాన్యాలను హెచ్చరించారు. వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వలంటీర్లు సమ్మెలోకి వెళుతున్నారని తప్పుడు వార్తలు ప్రచురించిన ఎల్లో మీడియాపై మండిపడ్డారు. మా జీవితాలలో వెలుగులు నింపి మాకంటూ ఒక గౌరవం నింపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఎప్పటికీ సమ్మె చేసే పరిస్థితే లేదన్నారు. అనంతరం ఈనాడు, ఆంధ్ర జ్యోతి దినపత్రికల ప్రతులను చూపిస్తూ దహనం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌కుమార్, నాగరాజు, సంపత్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలోని గాంధీబస్టాండ్ వద్ద ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలను వలంటీర్లు దహనం చేశారు. తమతో సమ్మె చేయించాలన్న ఎల్లో మీడియా కుట్రలు సాగవని చెప్పారు. సేవాభావంతో పని చేస్తున్న తమపై విషప్రచారం చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. మరోసారి తప్పుడు రాతలు ప్రచురిస్తే గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు చేతపట్టి పచ్చమీడియాకు వ్యతిరేకంగా ఈనాడు డౌన్ డౌన్, ఆంధ్రజ్యోతి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.

పీలేరులో..

గ్రామ వలంటీర్లు సమ్మెలోకి వెలుతున్నట్లు ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో తప్పుడు రాతలు రాయడంపై గ్రామ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా పీలేరులో శుక్రవారం పలువురు గ్రామ వలంటీర్లు ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సమ్మెకు వెలుతున్నట్లు ఎల్లో మీడియాలో వచ్చిన వార్తలు పూర్తిగా నిరాధారమైనవని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాటకు కట్టుబడి పని చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి తమకు ఎంతో గౌరవం ఇస్తున్నారని పేర్కొన్నారు.


పీలేరు: ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు దహనం చేస్తున్న వలంటీర్లు


అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో..

అభివృద్ధిని చూసి ఓర్వలేకే...

బ్రహ్మంగారిమఠం: వైఎస్సార్ సీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని పచ్చ పత్రిక తప్పుడు రాతలు రాసిందని బి.మఠం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం 'ఈనాడు'లో రూ 3కోట్ల ఆస్తిపై అధికార పార్టీ నాయకుల కన్ను అనే వార్త ప్రచురించింది. దీనిపై ఎంపీపీ ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండల అధ్యక్ష స్థానంలో ఉన్నప్పటి నుంచి బి.మఠం అభివృద్ధికి ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామోవిందరెడ్డి సహకారంతో ముందుకెళుతున్నానని, తాను, తన కుటుంబ సభ్యులు మండలంలో ఎక్కడా ప్రభుత్వ భూములను ఆక్రమించలేదన్నారు. బి.మఠం అభివృద్ధిని చూసి ఓర్వలేని వారు పచ్చ పత్రికకు సమాచారం ఇచ్చి తనపై తప్పుడు వార్త రాయించారన్నారు.అనంతరంనాలుగురోడ్ల కూడలిలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఈనాడు ప్రతులనుదహనం చేశారు.


ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వైఎస్సార్‌జిల్లా వాసులకు నంది పురస్కారాలు


నంది పురస్కారాన్ని అందుకుంటున్న మల్లికార్జునరెడ్డి

కడప కల్చరల్: వైఎస్సార్ జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యులు మూల మల్లికార్జునరెడ్డి, నాటక రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌కు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక నంది పురస్కారం లభించింది. సీపీ బ్రౌన్ బాషా పరిశోదన కేంద్రం సంచాలకులుగా, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులుగా జిల్లా వాసులకు సుపరిచితులైన ఆయనకు రాష్ట్ర చలన చిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ శుక్రవారం గుంటూరులో నిర్వహించిన నంది నాటక పోటీలో ఈ అవార్డును బహూకరించింది.

- మూల మల్లికార్జునరెడ్డికి నాటక పోటీల చివరి రోజున బహుమతి ప్రధానోత్సవంలో భాగంగా చలన చిత్ర, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి నంది జ్ఞాపికతోపాటు రూ. 35 వేల నగదు బహుమతిని అందజేసి సత్కరించారు. న్యూఢిల్లీ యూజీసీ 2012లో ఇచ్చిన మేజర్ ప్రాజెక్టులో భాగంగా మల్లికార్జునరెడ్డి రాయలసీమ నాటక వికాసం పుస్తకాన్ని ప్రచురించగా దానికి ఈ వేదికపై ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. నటుడు, దర్శకుడిగా ఆయన యోగి వేమన విశ్వవిద్యాలయంలో రంగస్థల నాటక విభాగ అభివృద్ధికి కృషి చేశారు.
- నంది నాటక పోటీల్లో జిల్లాకు చెందిన సవేరా ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన శ్రీరామ పాదుకలు నాటకానికి ఉత్తమ ద్వితీయ నాటక రచనగా రచయిత పల్లేటి లక్ష్మీకులశేఖర్‌కు నంది పురస్కారం లభించింది. జిల్లా వాసులకు నంది పురస్కారాలు దక్కడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైవీయూ వీసీ చింతా సుధాకర్, ఎస్కే వర్సిటీ పూర్వ వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ హుసేన్ సత్యాగ్ని, గానుగపెంట హనుమంతరావు, జింకా సుబ్రమణ్యం అవార్డు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సెమిస్టర్ ఫలితాలు విడుదల


పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, సీఈ తదితరులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నవంబర్ నెలలో నిర్వహించిన బీఈడీ, ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఈడీలో 72.34 శాతం, బీఈడీలో 85.92 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. గణాంకాలను విశ్లేషిస్తే బీఈడీ పరీక్షలకు 2117 మంది విద్యార్థులు హాజరుకాగా, 1819 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు.ఎంఈడీలో 47 మంది పరీక్షలకు హాజరుకాగా 34 మంది పాసయ్యారన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలోని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని హుండీల ఆదాయాన్ని శుక్రవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ ఆధ్వర్యంలో లెక్కించారు. మల్లేశ్వరస్వామి, పార్వతీదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాములవారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.18,82,222 లక్షల నగదు వచ్చింది. అలాగే 10గ్రాముల బంగారు, 1కేజీ 200 గ్రాముల వెండి కూడా వచ్చినట్లు అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఆలయ చైర్మన్, నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిత


మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు తదితరులు

- కలెక్టర్ విజయరామరాజు
- 38,531 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 29.33 కోట్ల విద్యాదీవెన నిధులు జమ

కడప సెవెన్‌రోడ్స్: ఉన్నత చదువులతో విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. పిల్లల చదవులు తల్లిదండ్రులకు ఆర్థికభారం కాకూడదని 'జగనన్న విద్యాదీవెన'పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోదని తెలిపారు. శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన బహిరంగ సభనుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదును జమచేశారు. ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ విజయరామరాజు, రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, హజ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ గౌజులాజం, ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, కేంద్ర మిషన్ శక్తి కమిషన్ సభ్యులు మూలె సరస్వతి వీక్షించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విద్యాదీవెన సాయం అందుకుని చదువుపై ఏకాగ్రతతో భవిష్యత్ వైపు అడుగులేయాలని ఆకాంక్షించారు. జిల్లాలో 38,531 మంది విద్యార్థుల తల్లులకు రూ. 29,33,98,016లు మంజూరైంది. జిల్లాలోని 9071 మంది ఎస్సీలకు రూ. 6.67 కోట్లు, 646 మంది ఎస్టీలకు రూ. 44.81 లక్షలు, 13,279 మంది బీసీలకు రూ. 9.50 కోట్లు, 6562 మంది ఈబీసీలకు రూ. 6.33 కోట్లు, 4656 మంది కాపులకు రూ. 3.62 కోట్లు, 4212 మంది ముస్లింలకు రూ. 2.66 కోట్లు, 105 మంది క్రిస్టియన్లకు రూ. 8.46 లక్షలు విడుదల చేశారు. ముఖ్యమంత్రి వీసీ అనంతరం విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి కలెక్టర్ అందజేశారు.

బృహత్తర పథకం




విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'జగనన్న విద్యా దీవెన'బృహత్తర పథకం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యాప్రదాతగా ఆంధ్రరాష్ట్ర చరిత్రలోనే సుస్థిర స్థానాన్ని సంపాదించారు. విద్యకు అంత్యంత ప్రాధాన్యం ఇచ్చి పాఠశాలల్లో అధునాతన వసతులు కల్పించారు. ఇంటర్ చదివే మా చెల్లికి అమ్మ ఒడి సాయం కూడా అందుతోంది.
- టి.నవీన లక్ష్మి, విజయ దుర్గ నర్సింగ్ కాలేజీ, కడప

తల్లులకు ఎంతో ప్రాధాన్యత




వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా భాద్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అనూహ్యమైన మార్పులు సంతరించుకుంది. విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చి.. విద్యార్థుల్లో చదువుపై మరింత ఇష్టాన్ని పెంచుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లులకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి ఆర్థిక లావాదేవీల విషయంలో జగనన్న నైపుణ్యాన్ని పెంచుతున్నారు.
- బి.భార్గవి భాయి, నిర్మల కాలేజీ ఆఫ్ నర్సింగ్, కడప

విద్యాదీవెన దేవుడిచ్చిన వరం



రాష్ట్ర ప్రభుత్వం అందించే 'జగనన్న విద్యా దీవెన'పథకాన్ని జగనన్న ఇచ్చిన వరంగా భావిస్తున్నాం. విద్యాదీవెన ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ నగదు మా అమ్మ అకౌంట్లో జమ అయ్యింది. నాకు నాలుగేళ్లుగా విద్యా, వసతి దీవెన సాయం పెండింగ్ లేకుండా అందుతోంది. నాన్నకు వైఎస్ఆర్ చేదోడు ఆర్థిక సాయం అందుతోంది.
- బి.గంగాదేవి, శారదా నర్సింగ్ కాలేజ్, కడప

ఇలాంటి పథకం ఎప్పుడూ లేదు



మాలాంటి వారు ఉన్నత చదువులు చదువుకోవడానికి ముఖ్యమంత్రి కల్పిస్తున్న గొప్ప వరం. 'జగనన్న విద్యా దీవెన'ద్వారా ఆర్థిక సాయం అందడంతో మా తల్లిదండ్రులకు మా చదువు కోసం అప్పులు చేయడం తప్పింది. గతంలో ఏ సీఎం కూడా ఇలాంటి గొప్పపని చేయలేదు.ముఖ్యమంత్రికి థ్యాంక్స్.
- పి.అనిత, నిర్మల కాలేజీ ఆఫ్ నర్సింగ్, కడప

గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి
- ముగిసిన రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్
- రీజినల్ స్థాయికి 35 ప్రాజెక్టులు ఎంపిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు తగ్గట్టుగా పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తోందని ఎస్‌సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా సైన్స్ అధికారి బి. మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్ శుక్రవారం ముగిసింది. సైన్స్‌ఫేర్‌కు 26 జిల్లాల నుంచి 234 ప్రాజెక్టులు వచ్చాయి.జ్యూరీ సభ్యులు వాటిని పరిశీలించి వీటిల్లో నుంచి 35 ప్రాజెక్టులను రీజినల్ స్థాయికి ఎంపిక చేశారు. ఇందులో టీచర్ కేటగిరీ కింద 10, గ్రూపు కేటగిరీ కింద 10, మరో 15 ప్రాజెక్టులను వ్యక్తిగత కేటగిరీ కింద ఎంపిక చేశారు. రీజినల్ స్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన వారికి మెమెంటోలు, షీల్డ్‌లు ప్రదాన చేసి అభినందించారు. అనంతరం డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముగింపు సభలో ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో 8వ తరగతి చదివే 10 లక్షల మందికి బైజ్యూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు చెప్పారు.అలాగే 6 నుంచి 10వ తరగతి వరకు 60 వేల తరగతి గదులకు ఇంటరాక్టిక్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పి) ఏరాటు చేశామన్నారు. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు గ్లోబల్ స్థాయిలో రాణిస్తారన్నారు.ఎస్‌సీఈఆర్టీ సహకారంతో సీబీఎస్‌సీ, స్టేట్ బోర్డు పాఠ్య పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందించామన్నారు. అలాగే ఐబీ బోర్డు సిలబస్ భారతదేశ వ్యాప్తంగా 256 స్కూళ్లలో ఉంటే ఏపీలో నాలుగు స్కూళ్లలో ఉన్నట్లు తెలిపారు. అనంతరం 26 జిల్లాల్లోని పాఠశాలలకు ఏడాది పొడువునా ఒక్క రోజు కూడా గైర్హాజరు కాకుండా వచ్చిన విద్యార్థులకు, క్రీడల్లో రాణించిన వారికి షీల్డ్‌లను ప్రదానం చేసి అభినందించారు. సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం నేర్పించాలన్నారు.ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని తెలిపారు.డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చదువుకోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే కాకుండా విద్యార్థుల కోసం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. వీటన్నింటి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓలు రాజగోపాల్ రెడ్డి, కృష్ణయ్య, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, కడప, సీకె దిన్నె ఎంఈఓలు పాలెం నారాయణ, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ కేటగిరీ..

టీచర్	జిల్లా	ప్రాజెక్టు పేరు
లలితాసుభాషిణి	చిత్తూరు	మై కేర్డ్ బెడ్ స్మూతింగ్ అండ్ ఆర్గానిక్ ఫర్ బెడ్‌రిడెన్ పేషెంట్
అంకమయ్య	పల్నాడు	మోడరన్ స్ట్రీట్ లైట్ పోల్
శ్యామ్‌కుమార్	కృష్ణా	ప్రివెన్షన్ ఆఫ్ ఫైర్ యాక్సిడెంట్ ఇన్ హౌస్ అండ్ ఆఫీస్
రఘు రమేష్	అనకాపల్లి	క్రియేటింగ్ ఇంటరాక్టివ్‌వీడియోస్ ఆగ్‌మెంటెడ్ రియాలిటీ ఇన్‌ఫర్మేషన్
గౌరీశ్వర్‌రావు	శ్రీకాకుళం	లైఫ్ సేఫ్టీ స్టిక్ ఫర్ ఫార్మర్స్
రవి శంకర్	కాకినాడ	ఇన్నోవేటివ్ టీఎల్ఎం
షెహనాజ్ బేగం	నంద్యాల	ఆటోమేటిక్ హ్యాండ్ శానిటైజర్ డిస్పెన్సర్
విజయ్‌కుమార్	కర్నూలు	సైన్స్ టీచింగ్, లర్నింగ్ స్ట్రాటజీస్
రాజారావు	విశాఖపట్నం	కూల్ హెల్మెట్
మహమ్మద్ రఫీ	అనంతపురం	ఆల్ ది కాన్సెప్ట్ ఆఫ్ లైట్ ఇన్ వన్ ఎగ్జిబిట్


వ్యక్తిగత కేటగిరీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధికారులు

రీజనల్ స్థాయికి ఎంపికైన వారు..

గ్రూపు కేటగిరీ ..

విద్యార్థి	జిల్లా	ప్రాజెక్టు పేరు
మహిత, శ్రీవర్షిణి	ఏలూరు	అవాయిడ్ ట్రైన్ యాక్సిడెంట్
మహాలక్ష్మి నాగచైతన్య	గుంటూరు	స్మార్ట్ మల్టీపర్పస్ చైర్
సాయిబాలాజీ భానుతేజ	అనకాపల్లి	స్మార్ట్ హౌస్
కంజాశ్రీ అమృతవర్షిణి	డాక్టర్ అంబేద్కర్ కోనసీమ	ఈజీ మిషన్స్ ఇన్ డైలీ లైఫ్
హరిప్రసాద్ అనందకుమార్	తూర్పుగోదావరి	బ్లైండ్ సెన్సార్ గ్లాస్
అరుణ్‌కుమార్ నరసింహా	ప్రకాశం	ఆయిల్ స్కిమ్మర్
ఎం.పావని హిమమాధురి	చిత్తూరు	ఇంటిగ్రేటెడ్ ఫామింగ్ సిస్టమ్
శ్రీహర్ష గణేష్	డాక్టర్ అంబేద్కర్ కోనసీమ	ఫ్యూచర్ రోడ్ టెక్నాలజీ
గోపాలకృష్ణ నాగపవన్	కృష్ణా	ఎల్ఐఎఫ్ఐ 6 జి
బెన్నీ మహేంద్రరెడ్డి	అనంతపురం	కవాచీ టెక్నాలజీ రైల్వే లైఫ్స్ ఆపరేషన్ బ్లూటూత్

వ్యక్తిగత కేటగిరీ..

విద్యార్థి	జిల్లా	ప్రాజెక్టు పేరు
చైతన్య	తూర్పుగోదావరి	లోకాస్టు వెంటిలేటర్ అంబు బ్యాగ్
గంగాధర్‌రెడ్డి	నంద్యాల	ఆటోమేటిక్ సోలార్ ట్రాకర్
శిరిషా	వైఎస్సార్	మల్టీపర్పస్ అగ్రికల్చర్ రోబోట్
విశ్వనాథ్	కృష్ణా	లిక్విడ్ ట్రీ
సాత్విక్	ప్రకాశం	హియరింగ్ త్రూ టీత్
అనిలసుధా	బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	సోలార్ సెన్సార్ క్యాటిల్ షెడ్డు
హేమసాగర్	అనంతపురం	జామెట్రీ డివైస్ ఎకో ఫైలెట్
సాయి	కాకినాడ	రిమోట్ కంట్రోల్ ఫామింగ్
పూజ	నంద్యాల	ఆటోమేటిక్ డ్రైనేజ్ క్లీనర్
చరణ్‌తేజ	పార్వతీపురం	స్టేర్‌కేస్ క్లైంబింగ్ గ్యాస్ సిలిండర్ ట్రాలీ
హాసినీ	విజయనగరం	స్మార్ట్ ట్రాలీ
అనూహ్యారెడ్డి	అనంతపురం	ట్రాఫిక్ బస్ వితౌవుట్ పొల్యూషన్
మీనా	చిత్తూరు	ఉమెన్ సేఫ్టీ డివైజ్
శివ కౌశిక్	ప్రకాశం	డ్రైవర్ యాంటీ స్లీప్ అలారమ్
రోహిత్	అన్నమయ్య	ఆర్ఎఫ్ ఐడీబేస్డ్ ఆటోమేటిక్ పెట్రోల్ పంప్ సిస్టమ్

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి


మృతి చెందిన వెంకటసుబ్బమ్మ

ఖాజీపేట : పంట పొలంలోని మినుము కట్టె నూర్పిడి చేసే ట్రాక్టర్ కింద పడి రావులపల్లె గ్రామానికి చెందిన పోతుల వెంకట సుబ్బమ్మ అనే మహిళ శుక్రవారం మరణించింది. చందిన జయరామిరెడ్డి పొలంలో పంట నూర్పిడి తరువాత ఒక కయ్య నుంచి వేరొక కయ్య దాటుతుండగా కిందపడింది. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ ఆమె పై నుంచి వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఖాజీపేట ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. సంబంధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఘర్షణ కేసులో జైలుశిక్ష

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ఘర్షణ పడ్డ కేసులో ఇరువురికి జైలు శిక్ష పడిన సంఘటన మైలవరం మండలంలో చోటు చేసుకొంది. ఎస్ఐ కృష్ణయ్య కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 7–5–2023 వ తేది రోజున వేపరాల గ్రామానికి చెందిన అలిశెట్టి కృష్ణయ్య, బడిగింజల శ్రీనివాసులు కుటుంబ సమస్యల కారణంగా బహిరంగ ప్రదేశంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఇరువురిపై పోలీస్ అధికారులు కేసులు నమోదుచేశారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని జూనియర్ సివిల్‌కోర్ట్‌లో హాజరు పరచగా సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కె.సి.లక్ష్మయ్య కేసును విచారించి ఇరువురికి నాలుగు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

హత్య కేసులో జీవితఖైదు


జీవితఖైదు పడిన నిందితులు

కడప అర్బన్ : కడప నగరంలోని రాజారెడ్డి వీధికి చెందిన దిద్దుకుంట లోకేశ్వరరెడ్డి అలియాస్ లోక అనే యువకుడిని 2014 ఫిబ్రవరి, 24వ తేదీన మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా లాయం సుధా హరినాథ్‌తో పాటు మురహరి విజయ్‌కుమార్, బాతుల సాయి ప్రశాంత్, భీమోళ్ల నరసింహ, ములక లోకోద్ధారరెడ్డిలు సుమోలో వెంబడించి కత్తులతో, కొడవళ్లతో దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటనలో నిందితులకు శుక్రవారం కడపలోని జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గల్లా శ్రీదేవి జీవితఖైదుతో పాటు, ఒక్కొక్కరికి రూ. 3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రకృతి సాగులో విజయనాదం

అతను అందరిలా ఒక పంట గురించే ఆలోచించలేదు..
కరువు దరువేస్తే ఎలా.. అంటూ ఉన్నచోటే ఆగిపోలేదు...
'ప్రకృతి'తో దోస్తీ కట్టి పొలం బాట పట్టాడు..
చిరు ధాన్యానికి జై కొట్టి
తనే హలమై ముందుకు కదిలాడు..
అతని శ్రమకు.. సంకల్పానికి
భూ తల్లి మురిసిపోయింది..
సాగు చేసిన 'చిరు' ధాన్యాలే..
ధన సిరులై ఇంట కురిపించింది.
పేరును సార్థకం చేస్తూ ముంగిట విజయమై
'సాగు'లా పడిపోయింది.

అవును..
వ్యవసాయాన్ని నమ్ముకున్న వారి బతుకుల్లో
సిరులు ఝరులై కురుస్తాయన్న సత్యాన్ని
నేలతల్లి రుజువు చేసింది.
ప్రకృతితో మమేకమై దుక్కి దున్నితే
జీవితమే 'పచ్చ'గా మారుతుందన్న నిజం
మరోసారి లోకానికి తెలిసింది.



ప్రకృతి వ్యవసాయంలో సాగుచేసిన దానిమ్మ తోటవద్ద కొమ్మూరు విజయ్‌కుమార్, పంటల సాగుకు వాడుతున్న సహజ ఎరువు

సాక్షి, కడప డెస్క్ : ప్రకృతి సాగులో కొమ్మూరు విజయ్‌కుమార్ కొత్త చరిత్ర లిఖించారు. చిరు ధాన్యాల సాగులో సిరులు పండిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తునారు. కడప నగరానికి ఆనుకొని ఉన్న ఎర్రముక్కపల్లెకు చెందిన కొమ్మూరు విజయ్‌కుమార్ తండ్రి ప్రభుదాస్ పులివెందుల తాలుకా వేంపల్లె సమీపంలో బెరైటీస్ మైనింగ్‌లో ఫోర్‌మెన్‌గా పని చేస్తుండేవారు. దీంతో కుటుంబం వేంపల్లె మండలంలోని టి.వెలమవారిపల్లెకు వలస వెళ్లారు. కుటుంబానికి ఉన్న 6 ఎకరాల భూమిలో కంది, జొన్నతోపాటు ఇతర పంటలను సాగు చేస్తూ జీవనం సాగించారు. 2006లో సొంత పని మీద హైదరాబాద్ వెళ్లిన విజయ్‌కుమార్‌కు అక్కడ కర్నూలు జిల్లా వెంకట్రాంపల్లెకు చెందిన సుబ్బారెడ్డితో పరిచయం చిరుధాన్యాలపై అవగాహన కలిగేలా చేసింది. అనంతరం తనకున్న పొలంలో ఎలా అయినా చిరుధాన్యాల సాగు చేయాలని నిర్ణయించారు. విత్తనాల కోసం తనకు తెలిసినవారి నుంచి కొర్రలను తెప్పించి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేశారు . ఏటా మార్చి– ఏప్రిల్ నెలల్లో విశాఖపట్నం జిల్లా అరకులో జరిగే సమత సంస్థ సభ్యుల (రైతులు) చిరుధాన్యాల ప్రదర్శనకు వెళ్లి అక్కడ చిరుధాన్యాలను సేకరించి తన పొలం పండించడం మొదలెట్టారు. అలా ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాల సాగు ఇప్పుడు ఇతర రాష్ట్రాల రైతులకు విత్తనాలను అందివ్వడమే కాక వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చే స్థాయికి చేరింది. జిల్లాలో 630 ఎకరాలకు పైగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చిరుధాన్యాలను సాగు చేయిస్తున్నారు. అందులో వల్లూరు, చాపాడు, ముద్దనూరు మండలాల్లో అధికంగా ఇతర మండలాల్లో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించేలా వారిని ప్రేరేపించారు.

కుటుంబ నేపథ్యం

కొమ్మూరు ప్రభుదాస్, సుశీలమ్మల పెద్ద కుమారుడైనా విజయ్‌కుమార్ చిన్నతనంలోనే కరెంట్ షాక్‌తో రెండు చేతుల వేళ్లు కొద్దిగా చలనం లేకుండా అయ్యాయి. చదువు కూడా పెద్దగా లేదు. కమ్యూనిస్ట్ భావాలు కలిగిన కుటుంబం కావడంతో చిన్నతనం నుంచే ఆ భావజాలం వైపు అడుగులు వేశారు. అప్పటి రాయలసీమ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌ఆర్‌డీఎస్) పాల్గొంటూ రైతాంగ సమస్యలపై ఉద్యమాలు, పర్యావరణ పరిరక్షణపై పోరాటాలు చేశారు. గద్దర్‌ను ఇష్టపడే విజయ్‌కుమార్ ఆయన లానే పాటలు పాడి చిన్నా,సన్నకారు రైతులకు, రైతు కూలీలకు అప్పటి భూస్వామ్య కుటుంబాలపై అవగాహన కార్యక్రమాలు చేసేవారు. ఇలా పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ఉండే సమయంలో హైదరాబాద్‌లో ఉండే పర్యావరణ పరిరక్షణ సభ్యురాలు, కాలమ్ రైటర్ అయిన కవుల సరస్వతి ఈయనకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన మెళకువలతోపాటు ఆయన కావాల్సిన సాయాన్ని చేసి మద్దతుగా నిలిచింది. ఆమె స్ఫూర్తి కారణంగా ఈయన తనతో పాటు పలువురిని ఆ వైపు నడిచేలా చేసింది. ప్రస్తుతం తనకు తన కుటుంబానికి ఉన్న 9 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా 6 ఎకరాల్లో చీని, నిమ్మ తోటలతోపాటు 3 ఎకరాల్లో వేరుశనగను సాగు చేస్తున్నారు. గ్రామంలోని ఇతర రైతులతో కొర్ర, అందు కొర్రలను సాగు చేయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. విజయ్‌కుమార్‌కు భార్య సుగుణమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. ఒక కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కాగా మిగిలిన ఇద్దరు కుమారులు ఈయనతోపాటు వ్యవసాయానికి సహకరించడమే కాక వీరు ప్రారంభించిన వెన్నెల రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన చిరుధాన్యాల విత్తనాలు, కాషాయాలను అందిస్తూ బాసటగా నిలుస్తున్నారు.

స్వయంగానే కషాయాల తయారీ

విజయ్‌కుమార్ నానమ్మ ఎలీషమ్మ తనకున్న చిన్న పాటి వ్యవసాయంతో పాటు నాటి వైద్యానికి అవసరమయ్యే పసరును తయారు చేసేవాళ్లు. నానమ్మ నుంచి నేర్చుకున్న ఆ విద్యను ప్రకృతి వ్యవసాయానికి అవసరమైన వాటిని స్వయంగా తయారు చేసుకొని వినియోగించారు. ఇప్పుడు వాటిని ఇతర రాష్ట్రాల్లోని రైతులకు కూడా తన ఆలోచనలు పంచుతూ వారికి అవసరమయ్యే కషాయాలను తయారు చేసుకునేలా తెలియజేస్తున్నారు.

మార్కెటింగ్

రైతులకు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లేలా చేయడమే కాక వారికి కావాల్సిన మార్కెటింగ్ సైతం అందుబాటులోకి తెచ్చేలా రైతు విజయ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. కొప్పర్తిలోని పారిశ్రామిక వాడలో అవనీ ఆర్గానిక్స్‌ను తీసుకువచ్చి తనలా చిరుధాన్యాల సాగు చేసిన వారి పంటను కొనేలా ప్రణాళికలు చేపడుతున్నారు. రసాయనిక వ్యవసాయం చేసి అప్పుల బాధలు పడుతున్న రైతులు ప్రకృతి వ్యవసాయ విశిష్టతను తెలుసుకొని ఆచరించాలని తెలియజేశారు.

జీవ వైవిధ్య సృష్టి



చిరుధాన్య పంటల జీవ వైవిధ్యానికి అలుపెరుగని కృషి చేస్తున్న కొమ్మూరి విజయ్‌కుమార్ ఇటీవలప్రతిష్ఠాత్మక సృష్టి సమ్మాన్ పురస్కారం లభించింది. ఈ నెల 23న గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లోని భగవత్ విద్యా పీఠంలో సాత్విక్ సంప్రదాయక ఆహారోత్సవంలో గుజరాత్ మాజీ ప్రధాన కార్యదర్శి పీకే లహరీ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

నవశకం

సొంతింటి కల నెరవేరింది



మాకు సొంతిల్లు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే నవరత్నాలలో ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం నుంచి రూ. 1.80 లక్షలు అందడంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నాం. ఇటీవల గృహప్రవేశం కూడా చేశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చలవతో మా కల సాకారమైంది. – కె చిన్నమ్మ, నాగిరెడ్డిగారిపల్లె, సంబేపల్లి మండలం.

నాడు-నేడుతో విద్యాభివృద్ధి



గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు. ఓ వైపు పాఠశాలల్లో వసతులు, మరో వైపు విద్యార్థులకు విద్యా సామగ్రి సకాలంలో అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతోంది. గతం కంటే ఫలితాలు మెరుగు పడ్డాయి. అందుకే ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న నా కుమారుడు పఠాన్ అయాన్ అలీ ఖాన్‌ను 8వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాను. విద్యలో కూడా బాగా రాణిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ని వసతులు కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు. – పఠాన్ అఫ్జల్ అలీ ఖాన్, కమలాపురం.

ముగిసిన డిగ్రీ కాలేజీల సమీక్ష


మాట్లాడుతున్న డిగ్రీ కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్

పులివెందుల టౌన్ : పట్టణంలోని న్యాక్ బిల్డింగ్ సమీపంలో ఉన్న ఇస్టాలో నాలుగో జోన్ ప్రభుత్వ, ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. డిగ్రీ కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్ ఆధ్వర్యంలో అకడమిక్ యాక్టివిటీపై 75 కళాశాలల ప్రిన్సిపల్స్, 200మంది ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల అడ్మిషన్లు, వర్క్‌లోడ్, సర్‌ప్లస్, పోస్టుల రిక్రూట్‌మెంట్, సాంక్షన్ పోస్టులకు సంబంధించిన వివరాలను ప్రతి కళాశాల నుంచి సేకరించి అకడమిక్ అభివృద్ధి కొరకు సూచనలు ఇచ్చారు. మేజర్ సబ్జెక్టు యూజీ కోర్సులపై అవగాహన కల్పించారు. జనవరి నెలలో 2024–25 అకడమిక్ సంవత్సరానికి అడ్మిషన్ల కొరకు క్యాంపెయిన్ చేయాలని సూచించారు. మూడో సంవత్సరం విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌ను కళాశాలలు ఉపాధి కల్పనకు సానుకూలంగా ప్రోత్సహించాలన్నారు. న్యాక్‌కు వెళ్లే కళాశాలలకు మంచి గుర్తింపుకు తగిన సూచనలు చేశారు. అటానమస్ కళాశాలల్లో నాలుగో సంవత్సర ఆనర్స్ కోర్సులను అమలుపరచాలన్నారు. అనంతరం ఆర్‌జేడీ నాగలింగారెడ్డి, బాబులు విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ ఆఫీస్ ఏజీఓ డాక్టర్ తులసి, అకడమిక్ ఆఫీసర్లు శ్రీధర్, రాంజీ, విజయ్‌కుమార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాకేమైనా జరిగితే సీఎందే బాధ్యత: బీటెక్ రవి

కడప రూరల్: ఉన్నఫళంగా తనకు కేటాయించిన సెక్యూరిటీని తొలగించారని, తనకేమైనా అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలుగుదేశం పార్టీ పులివెందుల ఇంచార్జి బీటెక్ రవి అన్నారు. కడపలో శుక్రవారం ఆయన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులు రెడ్డి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తనను అడ్డు తొలగించుకోవడానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. తనకు ప్రాణహాని జరిగితే అందుకు ముఖ్యమంత్రితో పాటు ఎంపీ అవినాష్ రెడ్డి బాధ్యత వహించాలన్నారు. 'బీటెక్ రవి ప్రాణాలకు నాదే బాధ్యత' అని ముఖ్యమంత్రి ఒక మాట చెబితే చాలునని, తనకు ఎలాంటి భద్రత అవసరం లేదన్నారు. కాగా, ఇటీవల ముఖ్యమంత్రి పర్యటనలో సింహాద్రిపురంలో కొత్త భవనాలను ప్రారంభించారని, అయితే అవి ఉన్న భవనాలను తొలగించి కట్టినవే తప్ప కొత్తగా చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు జరగాలన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడ నుంచి పోటీ చేస్తే తాను కూడా అక్కడి నుంచే పోటీకి నిలబడతానని బీటెక్ రవి అన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రూ.49లక్షలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదును ప్రదర్శిస్తున్న మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథ్ రెడ్డి

దువ్వూరు : అక్రమంగా ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.49లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు మైదుకూరు రూరల్ సీఐ శ్రీనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం దువ్వూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమంగా డబ్బు తరలిస్తున్నారన్న సమాచారంతో జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బందితో కలసి పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న కేఎంఆర్ ట్రావెల్స్ బస్సును ఆపి తనిఖీ చేయగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న బ్యాగ్‌లను తనిఖీ చేశామన్నారు. వారి వద్ద నుంచి ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.49లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ డబ్బును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

– కలెక్టర్ విజయరామరాజుచాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో వివిధ రాజకీయపార్టీల నాయకుల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి పెండింగ్ దరఖాస్తుల స్థితి, ముసాయిదా జాబితా, ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలు, రాజకీయ పార్టీ ప్రతినిధుల ఫిర్యాదుల పెండెన్సీ తదితర అంశాలపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీ ముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితాకు సంబంధించి వచ్చిన ఫామ్స్ 6,7,8 ల అభ్యర్థులును పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో అన్ని రకాల వసతులు సంసిద్ధం తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ర్యాంపుల సమస్య ఎక్కడ ఉండకూడదన్నారు. భవిష్యత్తులో ఎప్పుడూ జింక్ క్యారెక్టర్ లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ గణేష్ కుమార్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ రాం మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సాయిపేటకు చెందిన షేక్ సాదిక్ (30) ఈనెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదని, అతడికి మతిస్థిమితం సరిగా లేదని పోలీసులకు కుటుంబసభ్యులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ పోలీసులు తెలియజేశారు.

పటిష్టంగా రోడ్డు భద్రతా చర్యలు

జేసీ గణేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, ఈ విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రవాణాశాఖ ఆధ్వర్యంలో జేసీ అధ్యక్షతన జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అత్యధిక శాతం ప్రజలు రోడ్డు ప్రమాదాల కారణంగానే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. జనాభాతో పాటు వాహనాల వినియోగం కూడా పెరుగుతున్న నేపథ్యంలో రవాణా శాఖ, అనుబంధ శాఖల అధికారులు రహదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మలుపుల వద్ద బ్యారికేడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ ను గుర్తించడం, లాంగ్ డ్రైవ్ లో వచ్చే డ్రైవర్లకు అక్కడక్కడా రెస్ట్ ఏరియాలు, రెస్టారెంట్లు ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత కఠినతరం చేయాలన్నారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, హెల్మెట్ లేకుండా వాహనం నడపడం.. బస్సులు, ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై.. కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణ శాఖ అధికారులను ఆదేశించారు.

కొత్త సంవత్సర వేడుకల్లో అప్రమత్తం

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా.. నగరంలోని ప్రధాన రోడ్లపై యువత బైక్ రైడింగ్ విన్యాసాలను చేసే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సెలింగ్ ఇవ్వడం, ప్రత్యేక నిఘా ఉంచడం వంటి చర్యలను కఠినతరం చేయాలన్నారు. ప్రజల భద్రతే ధ్యేయంగా చర్యలు చేపట్టాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు బాధ్యతలను గుర్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతా సమన్వయ కమిటీ మెంబర్ కన్వీనర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ మీరా ప్రసాద్, ఆర్ అండ్ బీ డీఈ మాధవి, ఆర్అండ్‌బీ ఈఈ విజయ్ భాస్కర్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, రిమ్స్ సూపరింటెండెంట్ డా.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరుల నిధి కడప


మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అమితాబ్ భట్టాచార్య

కడప ఎడ్యుకేషన్ : అపారమైన సహజ వనరులతో పాటు విశాల హృదయులకు, రాజకీయ, సాహిత్య, శాస్త్ర సాంకేతిక కళలకు నిలయం కడపజిల్లా అని విశ్రాంత ఐఏఎస్ అధికారి అమితాబ్ భట్టాచార్య పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్ స్పందన హాలులో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన జిల్లాలో 40 ఏళ్ల క్రితం తాను పనిచేసినప్పటి అనుభవాలను అధికారులతో పంచుకున్నారు. తాను పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందినవాడినని, 1983 –85 మధ్య కాలంలో కడప జిల్లా కలెక్టర్‌గా పనిచేశానన్నారు. ప్రస్తుతం జిల్లా ఊహించనంత అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఇక్కడి ప్రజలు, మాటతీరు, పలకరింపు, ఆపాయ్యతలను తాను ఇంకా మరిచిపోలేదన్నారు. అనంతరం జిల్లా అధికారులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఇంచార్జి డీఆర్వో రామ్మోహన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కౌసర్ బాను, ప్రత్యూష, డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్ పీడీలు ఆనందనాయక్, యదుభూషన్‌రెడ్డి, శ్రీలక్ష్మిలతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రిక్వెస్టులను అనుమతించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికుల రిక్వెస్టులకు స్పందించాలని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి సూచించారు. పత్రికా ముఖంగా ఆయన పలు సూచనలు చేశారు. కడప–ప్రొద్దుటూరు మధ్య తిరుగుతున్న పల్లె వెలుగు బస్సుల్లో కొన్ని వివిధ ప్రాంతాల్లో ఆపడం లేదని విద్యార్థులు, ప్రయాణికులు ఫిర్యాదు చేశారన్నారు. ఇటువంటి తరుణంలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సు డ్రైవర్లు ప్రయాణికులు, విద్యార్థులు చేయి ఎత్తిన తరుణంలో బస్సును ఆపి ఎక్కించుకోవాలని సూచించారు. బస్సులో ప్రయాణికులు అధికంగా ఉన్నప్పటికీ ఈ నిబంధనను పాటించాల్సి ఉంటుందన్నారు. అలా స్పందించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సులను ఆపకపోతే సంబంధిత డిపో మేనేజర్లు (కడప–9959225774, బద్వేలు–9959225779, జమ్మలమడుగు–9959225778, పులివెందుల–9959225780, మైదుకూరు–9959225781, ప్రొద్దుటూరు–9959225777)కు లేదా జిల్లా ప్రజా రవాణాధికారి (9959225848)కి ప్రయాణికులు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అదృశ్యమైన బాలిక సురక్షితం

కడప అర్బన్ : కడప నగరంలోని విద్యుత్‌నగర్‌కు చెందిన ఓ బాలిక గత నెల 24వ తేదీన అదృశ్యమైన కేసులో ఆమెను తిరుపతిలో గుర్తించి సురక్షితంగా కడపకు తీసుకుని వచ్చినట్లు కడప 'దిశ' పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. శుక్రవారం కడపలోని 'దిశ' పోలీస్‌స్టేషన్‌లో కడప వన్‌టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విద్యుత్ నగర్‌కు చెందిన బాలిక కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆమె తండ్రి గత నెల 24న కళాశాల వద్ద బాలికను వదిలి వెళ్లగా, ఆ బాలిక తిరిగి రాకపోవడంతో 27న కడప వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తిరుపతిలో వుండగా ఆ బాలిక ఆచూకీ గుర్తించి సురక్షితంగా కడపకు తీసుకుని వచ్చారు. బాలికను వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించి పూర్తి స్థాయిలో విచారిస్తున్నామన్నారు.

పూర్తయిన న్యాక్ బృందం తనిఖీ


సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాక్ బృంద అధికారులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో మూడు రోజులపాటు నిర్వహించిన నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్(న్యాక్) బృందం తనిఖీలు శుక్రవారం నాటితో పూర్తయ్యాయి. మూడు రోజులపాటు అన్ని విభాగాల్లోని తరగతి గదులు, సెంట్రల్ లైబ్రరీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఒకేషనల్ కోర్సులు తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులతో విడివిడిగా సమావేశమై మౌలిక వసతుల సౌకర్యాలపై ఆరా తీశారు. శుక్రవారం క్యాంపస్‌లోని అతిథి భవనంలో చాన్సలర్ చెంచురెడ్డి, వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్, కన్వీనర్ వేణుగోపాల్ రాజు, నాలుగు ట్రిపుల్ ఐటీల డైరెక్టర్లతో కలిసి సమావేశం నిర్వహించి తగిన సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, అకడమిక్ డీన్ రత్నకుమారి, కో–ఆర్డినేటర్ మోహన్‌రావు, పీఆర్‌ఓ తిరుపతిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఎద్దులు మృతి

బి.కోడూరు : మండలంలోని గుంతపల్లె గ్రామానికి చెందిన నాగూరి గంగిరెడ్డిగారి ఈశ్వర్‌రెడ్డికి చెందిన రెండు ఎద్దులు శుక్రవారం సాయంత్రం 5.40 గంటల సమయంలో గుంతపల్లె చెరువు గుంతలో పడి మృతిచెందాయి. వివరాలిలా ఉన్నాయి. పొలం పనులు ముగించుకుని ఎద్దులను శుభ్రపరిచే క్రమంలో గుంతపల్లె చెరువులోకి తీసుకెళ్ళి వాటిని శుభ్రం చేస్తుండగా రెండు ఎద్దులు పోట్లాడుకునే క్రమంలో చెరువులోపల ఉన్న గుంతలోకి వెళ్లిపోయాయి. కాగిమానుకు ఉన్న తాడు, పగ్గాలు ఎద్దుల కాళ్ళకు చుట్టుకోవడంతో ఈత కొట్టేందుకు వీలు లేక గుంతలో మునిగిపోయి మృత్యువాతపడ్డాయి. అక్కడ చుట్టుపక్కల ఎవరు లేకపోవడంతో యజమాని ఒక్కడే ఉండటంతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో నిలిచిపోయాడు. మృతిచెందిన ఎద్దుల విలువ సుమారు రూ.1.70 లక్షలు ఉంటుందని సమాచారం.